సాక్షి
జోగులాంబ గద్వాల
మంగళవారం ¦ 13 ¦ ఆగస్టు ¦ 2024



జూరాల గేట్ల మూసివేత

ఎగువ నుంచి వరద నిలిచిపోవడంతో జూరాల ప్రాజెక్టు గేట్లు మూసివేశారు.

వివరాలు 8లో ▸



వ్యక్తిగత పరిశుభ్రతే ముఖ్యం

ప్రతిఒక్కరికి వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.2 /26.1

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడూ మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేసుల నమోదులో నిర్లక్ష్యం తగదు



గద్వాల క్రైం: సమస్యలపై వచ్చే బాధితులతో సిబ్బంది స్నేహ పూర్వకంగా ఉండాలని.. కేసుల నమోదులో నిర్లక్ష్యం వహించవద్దని ఎస్పీ శ్రీనివాస రావు అన్నారు. సోమవారం సాయంత్రం ఎస్పీ, డీఎస్పీ సత్యనారాయణ పట్టణ పోలీసు స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఫిర్యాదులపై వేగవంతంగా విచారణ చేపట్టి బాధితులకు పోలీసుశాఖపై నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలన్నారు. కాలనీలో నిత్యం గస్తీ, పెట్రోలింగ్ నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైం, మహిళల వేధింపులు, అత్యాచార యత్నం, మిస్సింగ్ కేసులలో ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. పట్టణ శివారుల్లో నిత్యం వాహనాల తనిఖీతో పాటు డ్రంకెన్ డ్రైవ్ చేపట్టడంతో పాటు స్టేషన్ పరిశరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, సిబ్బంది విధులు పట్ల నిర్లక్ష్యం వహించిన శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసుల వివరాలపై ఆరా తీశారు. కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసి నేరస్తులకు శిక్షపడేలా కృషి చేయలన్నారు. డయల్ 100 కాల్స్ విషయంలో త్వరగా స్పదించాలన్నారు. ఆయన వెంట సీఐ భీంకుమార్,ఎస్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండాలి



రాజోళి: నదీ తీర గ్రామాల్లో ఎవరూ ఆందోళన చెందవద్దని తహసీల్దార్ హరికృష్ణ తెలిపారు. సోమవారం ఆయన సుంకేసుల డ్యాంతో పాటు నదీ తీర గ్రామాల్లో పర్యటించారు. ఎగువ నుంచి వరద నీరు ఎక్కువ మొత్తంలో వస్తున్నప్పటికీ గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరమేమి లేదని, సుంకేసుల డ్యాం, ఎగువన ఉన్న డ్యాం అధికారులు ప్రణాళిక ప్రకారం నీటి విడుదల చేస్తున్నారని అన్నారు. డ్యాంలో సామర్థ్యం మేరకే ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో ఉంటున్నాయని సంబంధిత అధికారులు చెప్పారన్నారు. కాగా నదీ తీర గ్రామాల్లో యువకులు సెల్ఫీల మోజులో నది దగ్గరకు వెళ్లడం, రీల్స్ పేరుతో విన్యాసాలు లాంటి సాహసాలు చేసి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అత్యవసర సమాచారమైనా రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

భారీగా నాయబ్ తహసీల్దార్ల బదిలీలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో నాయబ్ తహసీల్దార్ల (డిప్యూటీ తహసీల్దార్) బదిలీలు భారీగా అయ్యాయి. ఈ మేరకు సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జోన్–7 పరిధిలో బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 36 మంది నాయబ్ తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఇందులో రాజశేఖర్, శ్యాంసుందర్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్ జోగుళాంబ గద్వాల జిల్లాకు, ఎస్.చంద్రశేఖర్, ఎండీ హనీఫ్‌ఖాన్, గురురాజారావు నారాయణపేట జిల్లాకు బదిలీ కాగా.. మిగతా 30 మందిని మహబూబ్‌నగర్ జిల్లాకే కేటాయించారు. వీరంతా ఈ జిల్లాలోనే ప్రస్తుతం పనిచేస్తున్న వారు కావడం గమనార్హం.

30 మంది డీటీలు..

కేసిరెడ్డి దేవేందర్, భరత్‌కుమార్, శోభ, రహమాన్, స్వప్న, రవికాంత్, మాధవి, శేఖర్, రాజీవ్‌రెడ్డి, వరప్రసాద్, గాయత్రి, రాజగోపాల్, కిషోర్, కె.దీపిక, జె.దీపిక, శివరాజు, ఆనందం, సునీల్‌కుమార్, ఖలీల్, భారతి, ఇంతియాజ్, హేమ్లా, వెంకటేశ్వరరావు, లావణ్య, బాలప్రసాద్, విష్ణుప్రియ, సువర్ణ, సుజాతకుమారి, కె.శ్రీనివాసులు, ఎండీ జాఫర్‌లను మహబూబ్‌నగర్ జిల్లాకు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీల ప్రక్రియ జూలై 31తో ముగించాలని ఉత్వర్వులు ఇచ్చిన మేరకు అన్ని శాఖలలో బదిలీలు పూర్తయ్యాయి. కేవలం జిల్లాలో నాయబ్ తహసీల్దార్ల బదిలీల ప్రక్రియ గత 12 రోజుల నుంచి కొనసాగింది. అయితే జిల్లాలో పనిచేస్తున్న 36 మంది నాయబ్ తహసీల్దార్లు బదిలీ కాగా.. ఇందులో 30 మంది మహబూబ్‌నగర్‌కు కేటాయించారు. ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చిన వారు ఒక్కరూ లేరు. అయితే ఈ 30 మందిని జిల్లాకు కేటాయించడంలో కొందరు ఉద్యోగ సంఘాల నాయకులు కీలకంగా వ్యవహరించినట్లు ప్రచారం జరుగుతుంది. ముఖ్యంగా కలెక్టరేట్ కార్యాలయంలో చాలా మంది ఏళ్లతరబడిగా ఇక్కడే పని చేస్తున్నారు. వారిని కదిలించకుండా సంఘం నాయకులు చక్రం తిప్పినట్లు వాదనలు వినిపిస్తున్నాయి.

సరిహద్దు దాటిస్తున్నారు..!

రూటు మార్చిన రేషన్ బియ్యం అక్రమార్కులు

- డీలర్లు.. వ్యాపారులే మాఫియాగా మారిన వైనం
- నిద్రావస్థలో సివిల్ సప్లయ్ శాఖ అధికారులు
- పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్న బియ్యం వాహనాలు
- 579 క్వింటాళ్ల బియ్యం సీజ్
- 43 మంది అరెస్టు.. 33 వాహనాలు సీజ్

గద్వాల క్రైం: ప్రభుత్వాలు మారినా అక్రమార్కుల తీరు మారడం లేదు. ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా ప్రభుత్వం పేదలకు బియ్యం అందజేస్తుండగా.. కొందరు అక్రమార్కులు ఆ బియ్యాన్ని సొమ్ము చేసుకుంటూ రూ.లక్షలు గడిస్తున్నారు. రేషన్ డీలర్లు, వ్యాపారులే మాఫియాగా మారి లబ్ధిదారుల నుంచి కిలో రూ.10 నుంచి రూ.12వరకు చెల్లించి రూ.30 చొప్పున బయటి రాష్ట్రాలకు తరలించేస్తున్నారు. పేదల బియ్యం యథేచ్ఛగా సరిహద్దు దాటుతున్నా.. నిలువరించాల్సిన సివిల్ సప్లయి శాఖలోని కొందరు అధికారులు ఆమ్యామ్యాలకు అలవాటుపడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. అయితే, గుట్టుగా రాష్ట్రాల సరిహద్దు దాటే ప్రయత్నం చేస్తున్న తరుణంలో సమాచారం అందినా.. లేదా రోజువారీ తనిఖీల్లో మాత్రం బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాలు పట్టుబడుతున్నాయి. గడచిన ఏనిమిది నెలల వ్యవధిలో 33 కేసులు, 33 గూడ్స్ వాహనాలు, 43 మంది నిందితులను అరెస్టు చేసి 579 క్వింటాళ్ల రేషన్ బియ్యంను సీజ్ చేశారు. నడిగడ్డలో బియ్యం మాఫియాపై రూటు మార్చి వివిధ దారుల్లో కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకు తరలించి పెద్ద ఎత్తన వ్యాపారం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా పోలీసుశాఖ నిఘా ఉంచింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా డీలర్లు, బియ్యం వ్యాపారుల సమాచారం సేకరించినట్లు తెలిసింది.



బియ్యం పట్టుబడిన ఘటనలు ఇలా..

- జనవరి 29వ తేదిన కేటీదొడ్డి మండల శివారు ప్రాంతంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో వడ్డెరవి గూడ్స్ వాహనంలో 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రాయచూర్‌కు తరలిస్తు పట్టుబడ్డాడు.
- ఏప్రిల్ 27న వడ్డేపల్లి గ్రామంలో తెలుగు భాస్కర్ పిండి గిర్నీ ఏర్పాటు చేసుకుని గుట్టుగా 221 సంచుల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచుకున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు తనిఖీలు చేసి 114 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ బియ్యాన్ని నూకలుగా మార్చి విక్రయిస్తున్నట్లు తెలిపారు.
- జూలై 18వ తేదీన గద్వాల పట్టణ శివారులోని బీడీ కాలనీ మీదుగా ధరూర్ మండలం పార్చర్ల గ్రామానికి చెందిన సహదేవుడు గూడ్స్ వాహనంలో 50 సంచుల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

అంతా మాఫియా చేతుల్లో..



వడ్డేపల్లి గ్రామంలో పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)

రేషన్ బియ్యం మాఫియా చేతుల్లో ఎన్ని వందల క్వింటాళ్ల రేషన్ బియ్యం రాష్ట్రాలు దాతుతున్నది చెప్పలేని పరిస్థితి. రెండు రాష్ట్రాల సరిహద్దు కావడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యాపారులు సైతం ఇదే రూట్‌లో అధికారుల కళ్లకు గంతలు కట్టి బియ్యం తరలిస్తున్నారు. ఇదిలాఉండగా, పోలీసుల తనిఖీలో పట్టుబడితే తప్పా రేషన్ బియ్యం మాఫియాను కట్టడి చేయడం లేదు. గతంలో పలువురు రైస్ మిల్లర్లు పెద్ద ఎత్తున అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్లు పోలీసులకు తెలియడంతో పలు రైస్ మిల్లులు సీజ్ అయిన సంఘటనలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో డీటీ స్థాయి అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. ఇప్పటికైనా సివిల్‌సప్లై శాఖ అధికారులు నిద్రావస్థ వీడి క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరం చేస్తే ఆదిలోనే ఈ బియ్యం మాఫియాకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంది.

చూసీచూడనట్లుగా సివిల్ సప్లయ్ శాఖ అధికారులు

జిల్లా వ్యాప్తంగా 360 రేషన్ డీల్లర్ దుకాణాలు ఉన్నాయి. అలాగే, 1.46లక్షల తెల్లరేషన్‌కార్డులు, 10వేల అంత్యోదయ, 130 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. ప్రతి నెల ఎఫ్‌సీఐ గోదాంల నుంచి 31వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ప్రతి నెల సివిల్ సప్‌లైశాఖ, ఎన్‌ఫోర్సు మెంట్ సిబ్బంది తనిఖీలు చేయడంలో విఫలమయ్యారు. ఇదే అదునుగా బావించిన డీల్లర్లు నేరుగా బియ్యంను లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి బడా వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వీరు సొంత రైస్ మిల్లులో నిల్వ ఉంచుకోవడం లేదా వాటిని మర ఆడించి సన్న బియ్యంగా మార్చి ప్రజలకు విక్రయాలు చేస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంపై ఇంత పెద్ద మొత్తంలో అక్రమాలు జరుగుతున్నా ఆశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు ఒక్కటీ లేక పోవడం గమనార్హం.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం



జిల్లాలో రేషన్ బియ్యం దందాపై ప్రత్యేక నిఘా ఉంచాం. అనుమానాస్పద వ్యాపారులు, డీల్లర్ల వివరాలు సేకరించాం. సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎక్కడైన రేషన్ బియ్యం అక్రమంగా సరఫరా చేసినా.. నిల్వలు ఉన్నట్లు తెలిసినా దాడులు చేపట్టి కేసులు నమోదు చేస్తున్నాం. గతంలో నమోదైన కేసులు, వ్యాపారులు, సహకరించిన వ్యక్తులు ఎవరు అనే కోణంలో నిఘా ఉంచాం. బియ్యం పక్కదారి పటిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదు.

– శ్రీనివాసరావు, ఎస్పీ

ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి

శాంతినగర్: పదో తరగతి పాస్ కాని వారు, మధ్యలో చదువులు మానేసిన వారు ఓపెన్ టెన్త్ (ఎస్సెస్సీ), ఇంటర్‌కు దరఖాస్తులు చేసుకోవాలని శాంతినగర్ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ.రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ నెల 10లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాల కొరకు పాఠశాల కోఆర్డినేటర్ కెఎన్ శేషన్ సెల్ నం .9885994554 సంప్రదించాలని ఆయన కోరారు.

కార్మికుల హక్కులు కాపాడుకుందాం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మికుల హక్కులు కాపాడుకునేందుకు కలిసిరావాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ అన్నారు. సోమవారం ఆల్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చాల ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల కోసమే పనిచేస్తుందని విమర్శించారు. ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని దుయ్యబట్టారు. ప్రభుత్వరంగ సంస్థలైన రైల్వే, బొగ్గు, విమానయాన, చమురు సంస్థలను కారుచౌకగా స్వదేశి, విదేశి కార్పొరేట్లకు అమ్మేస్తుందని ఆరోపించారు. 2015లో పార్లమెంట్‌లో నరేంద్రమోదీ ఇచ్చిన కనీస మద్దతు ధర హామీని ఇప్పటికీ అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం అర్ధరాత్రి వరకు చేపట్టే జన జాగరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాములు, కురుమూర్తి, రామ్మోహన్, చంద్రకాంత్, రాజ్‌కుమార్, బాబుమియా, వినయ్, అశ్విన్, గోపాల్, రాజు, పాల్గొన్నారు.

పకడ్బందీగా స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లు



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్: స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో అధికారులో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలను నిర్వహిస్తున్నందున అందుకనుగుణంగా వేదిక, అతిథులకు అవసరమైన వేదిక, ప్రజలకు ప్రత్యేకమైన గ్యాలరీ ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా కనీస సౌకర్యాలు వైద్యం, తాగునీటి వసతి, ఫైర్‌ఇంజిన్ వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలలో జాతీయభావం ఉట్టిపడేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపిక కోసం శాఖల వారీగా ప్రతిపాదనలు పంపాలన్నారు. సమావేశంలో ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, ఎస్‌డీసీ శ్రీనివాస్ రావు, ఆర్డీవో రాంచదర్, అదనపు ఎస్పీ గుణశేఖర్, ఏవో వీరభద్రప్ప, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి 35 ఫిర్యాదులు

గద్వాల రూరల్: పరిష్కారం కోసం వచ్చిన ఫిర్యాదుదారులకు సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 35 ఫిర్యాదులు వచ్చినట్లు వీటిని ఆయా శాఖలకు చెందిన అధికారులకు పంపించారు. ప్రతి ఫిర్యాదుదారునికి పరిష్కారం చూపాలని లేనిపక్షంలో అందుకు సంబంధించిన కారణాలను వివరిస్తూ ఫిర్యాదుదారునికి అక్నాలెడ్జ్‌మెంట్ పంపాలన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, ఆర్డీవో రాంచందర్, ఎస్‌డీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 13 అర్జీలు

గద్వాల క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి 13 ఫిర్యాదులు అందాయని ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో నాలుగు భూ సంబంధ, సైబర్ క్రైం, మిస్సింగ్ కేసు ఇతరాత్ర వాటిపై ఫిర్యాదులు అందాయన్నారు. భూ తగదాలకు సంబంధించిన వాటిని కోర్టు ద్వారా పరిష్కారం చేసుకోవాల్సిందిగా ఎస్పీ బాధితులు తెలియజేశారు.



జేసీబీతో కాల్వ మరమ్మతు పనులు చేయిస్తున్న ఆర్డీఎస్ అధికారులు

ఆర్డీఎస్ కాల్వ మరమ్మతు షురూ..

సాక్షి ఎఫెక్ట్..

శాంతినగర్: ఆర్డీఎస్ కెనాల్ కోతకు గురై నీటి పారుదల నిలిచిపోగా.. ఎట్టకేలకు ఆర్డీఎస్ అధికారులు స్పందించి సోమవారం మరమ్మతు పనులు ప్రారంభించారు. వల్లూరు సమీపంలోని ఆర్డీఎస్ డి–29 సమీపాన ఆర్డీఎస్ ప్రధాన కాల్వ గత బుధవారం కోతకు గురి కాగా.. రైతులు నాట్లు వేసుకోవడానికి ఇబ్బందులు పడుతుండగా దీనిపై 'రైతుల ఆశలు.. అడియాశలు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. తుమ్మిళ్ల లిఫ్ట్ నుంచి విడుదల చేసిన నీరు పంట పొలాల్లోకి చేరడంతో ఆర్డీఎస్ అధికారులు లిఫ్ట్ మోటార్‌ను బంద్‌చేశారు. దీంతో కెనాల్‌లో నీటి ప్రవాహం నిలిచిపోయింది. దీంతో అధికారులు స్పందించారు. జేసీబీతో మరమ్మతు పనులు చేపట్టారు. కోతకు గురైన కెనాల్ కట్టకు మట్టినింపే పనులు చేపట్టారు. మూడు రోజుల్లో పనులు పూర్తవుతాయని, ఆ వెంటనే నీటిని విడుదల చేస్తామని అధికారులు రైతులకు భరోసా ఇవ్వడంతో ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్ని పరిశ్రమ అభివృద్ధికి చేయూత



కార్మికులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్

కోస్గి: జిల్లాలో ఉన్ని పరిశ్రమ మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, ఉన్ని పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా కావాల్సిన చేయూతనిస్తామని రాష్ట్ర హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి కోస్గిలో ఉన్న ఉన్ని పారిశ్రామిక సహకార సంఘంలో ఉన్న మగ్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులతో ముఖాముఖిగా మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, తయారు చేస్తున్న ఉన్ని ఉత్పత్తుల మార్కెటింగ్, ముడిసరుకు కొనుగోలు, సగటున తయారవుతున్న ఉత్పత్తి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. తయారు చేసిన ఉన్ని ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర రావడం లేదని పలువురు కార్మికులు వివరించారు. గతంలో ఉన్న పాత సొసైటీలకు ఉన్న అప్పులను వెంటనే వసూలు చేయాలని, కొత్తగా కార్మికులకు పావలా వడ్డీ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ ఏడీ, తహసీల్దార్‌లను ఆదేశించారు. కార్మికులకు భూమి ఉంటే షెడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని, జిల్లాకు ఇంకా ఎన్ని మగ్గాలు అవసరమో గుర్తించి నివేదిక ఇవ్వాలని ఏడీకి సూచించారు. పోతిరెడ్డిపల్లిలో నాలుగు, హకీంపేటలో 5 మగ్గాలు ఉన్నట్లు కార్మికులు తెలిపారు. కార్మికులకు కావాల్సిన మగ్గాలు ఇవ్వడంతోపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, మగ్గాలు తీసుకునే కార్మికులకు సహాయం అందిస్తామన్నారు. ఇందులో కలెక్టర్ సిక్తా పట్నాయక్, శిక్షణ కలెక్టర్ గరిమ నరుల, మున్సిపల్ కమిషనర్ శశిధర్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్‌తోపాటు పలువురు కార్మికులు ఉన్నారు.

చేనేత కామన్ ఫెసిలిటీ సెంటర్ పనులు వేగవంతం

నారాయణపేట: కామన్ ఫెసిలిటీ సెంటర్ హ్యాండ్లూమ్ భవనం పనులు వేగివంతం చేయాలని రాష్ట్ర హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ సూచించారు. సోమవారం నారాయణపేటలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నూతనంగా నిర్మిస్తున్న కామన్ ఫెసిలిటీ సెంటర్ హ్యాండ్లూమ్ భవనం పనులను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మూడు నెలల్లోగా నిర్మాణ పనులు పూర్తిచేసి హ్యాండ్లూమ్ సెంటర్‌లో సేల్స్ ఎంపూరిమ్, హ్యాండ్లూమ్, ట్రైనింగ్, కామన్ ఫెసిలిటీ సెంటర్, ఫుడ్ కోర్ట్‌కు బిల్డింగ్ అప్పగించాలన్నారు.

17న ప్రత్యేక అవసరాల పిల్లలకు క్యాంపు

అలంపూర్: ఈనెల 17న ప్రత్యేక అవసరాలు (దివ్యాంగులు) గల పిల్లలకు జిల్లా కేంద్రంలో ఉచితంగా కృత్రిమ అవయవాలు, పరకిరాలు అందించే క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంఈఓ అశోక్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాలలోని చింతల్ పేట్ బాయ్స్ హైస్కూల్ నందు ఏఎల్ఐఎంసీఓ క్యాంపు నిర్వహించనున్నట్లు, ఉదయం 10 గంటల లోగా అక్కడకు చేరుకోవాలని, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, తదిదర సర్టిఫికెట్లతో హాజరైతే వారికి కావాల్సిన ఉపకరణాలను అందచేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పెబ్బేరు రూరల్: తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఆత్మకూర్, ఖిల్లాఘనపూర్, వీపనగండ్ల, రేవల్లి సామాజిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి ఐదు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా.. వారి జీవితాలు మాత్రం మారడం లేదన్నారు. సంబంధిత సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ కాంట్రాక్టర్‌ను వేతనాలు చెల్లించాలని అడిగితే దాటవేస్తూ, డొంకతిరుగుడు సమాధానం చెప్పడంతో పాటు కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించాలని కోరారు.

అవయవాల దానంతో ప్రాణాలు కాపాడవచ్చు

పాలమూరు: మానవ శరీరంలో ఉండే అవయవాలు దానం చేయడం వల్ల అనారోగ్య సమస్యలతో ఉన్న ఎంతో మంది అభాగ్యులను రక్షించిన వాళ్లమవుతామని అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు, స్టెక్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. ఎస్‌వీఎస్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్‌వీఎస్ ఆడిటోరియంలో మెడికల్, డెంటల్, నర్సింగ్, పారామెడికల్ విద్యార్థులకు అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం మృతిచెందిన తర్వాత శరీరం మట్టిలో లేదా చితిలో బూడిద కాకుండా.. అవయవాలు అవసరం ఉన్న వారికి దానం చేస్తే ప్రాణాలు రక్షించవచ్చన్నారు. శరీరం డొనేట్ చేయడం వల్ల వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు సైతం ల్యాబ్‌లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ కాట్రగడ్డ భారతి, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, మహబూబ్‌నగర్ అధ్యక్షుడు కేశవులు, ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ జోషి, వైద్యులు దిలీప్, సునీల్, ప్రదీప్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతానికి గురై రైతు మృతి

భూత్పూర్: మండలంలోని మద్దిగట్లలో ఆదివారం రాత్రి వ్యవసాయ పొలంలో విద్యుదాఘాతానికి రైతు మృతిచెందినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన మేకల లక్ష్మయ్య (62) ఆదివారం సాయంత్రం గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం వద్దకు నీరు పెట్టడానికి వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పాడు. రాత్రి 8 గంటల అయిన ఇంటికి రాకపోవడంతో కుమారులు శివరాజు, మల్లేష్ పొలం వద్దకు వెళ్లారు. స్తంభం నుంచి స్టార్టర్ డబ్బా వరకు కరెంట్ సరఫరా అయ్యే సర్వీసు వైరు తేలి ఉండటంతో వైరుకు తగలడంతో షాక్‌కు గురై మృతిచెందాడు. సోమవారం కుమారుడు శివరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): మండలంలోని శాయిన్‌పల్లికి చెందిన యాదయ్య(21) సోమవారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదయ్య శాయిన్‌పల్లి గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ మధ్యకాలంలో విధులకు దూరంగా ఉండి.. ఇంటి వద్దనే ఖాళీగా ఉంటున్నాడు. సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి కాపాడే ప్రయత్నం చేసినా.. ఫలితం లేకపోయింది. యువకుడి ఆత్మహత్యకు కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

పాన్‌గల్: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపేటకు చెందిన కందూరు శేషిరెడ్డి(70) ఈనెల 8న కళ్లు కనిపించక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి వాంతులు చేసుకున్నాడు. దీన్ని కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి వృద్ధుడు మృతిచెందాడు. అతని కుమారుడు నాగిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్యాస్ గోదాంలో సిలిండర్ల చోరీ

జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలోని బూరెడ్డిపల్లి శివారులో గల ప్రణవి ఇండెన్ గ్యాస్ గోదాం తాళాలు పగుల సిలిండర్లు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. సోమవారం గోదం వద్దకు వెళ్లి చూడగా తాళాలు విరగ్గొట్టి ఉన్నాయని, గోదాంలో 14.2 కిలోల బరువు కలిగిన 51 సిలిండర్లు, 19 కిలోల 9 సిలిండర్లు, 5 కిలోల 26 సిలిండర్లు చోరీకి గురయ్యాయని మేనేజర్ కృష్ణంరాజు ఫిర్యాదు చేశారు.

యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: ఓ యువకుడు తన కూతురిని కిడ్నాప్ చేశాడని బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. హన్వాడ మండలంలోని ఓ తండాకు చెందిన యువకుడు తన కూతురిని కిడ్నాప్ చేశాడని జిల్లా కేంద్రంలోని భగీరథకాలనీకి చెందిన ఓ యువతి తల్లి సోమవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిషేధిత గుట్కాల పట్టివేత

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తా ఏరియాలో యూసుఫ్ తాజ్‌కి చెందిన కిరాణా షాపులో అక్రమంగా గుట్కాలు నిల్వ ఉంచి విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారంతో సోమవారం టాస్క్ ఫోర్స్, నారాయణపేట పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. రూ.17వేల విలువ చేసే ప్రభుత్వ నిషేధిత అంబర్, జర్ద గుట్కా ప్యాకెట్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యూసుఫ్ తాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా గుట్కాలు నిల్వ ఉంచినా, రవాణా చేసిన, ప్రజలకు అమ్మినా.. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



జూరాల క్రస్టు గేట్ల మూసివేత



మూసివేసిన జూరాల గేట్లు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గిపోవడంతో గేట్లను మూసి వేసినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం ప్రాజెక్టుకు 85వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టుకు 20వేల క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 68, నెట్టెంపాడుకు 750, కుడి కాల్వ ద్వారా 717, ఎడమ కాల్వకు 820, కోయిల్‌సాగర్‌కు 630, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 150 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,985 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.493 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 54వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండని, 15వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 118.2 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. 6వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 33.1 టీఎంసీల నీరు నిల్వ ఉంది.


435 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో సోమవారం 11 యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపడుతునట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 102.011 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించామని తెలిపారు. 11 యూనిట్ల ద్వారా పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేపడుతున్నామని, ప్రస్తుతం 30వేల క్యూసెక్కులను వినియోగిస్తున్నట్లు తెలిపారు.

సుంకేసులకు పెరిగిన వరద

రాజోళి: సుంకేసుల డ్యాంకు సోమవారం ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరింది. ఆదివారం 30వేల క్యూసెక్కులతో ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో కొనసాగగా, 7 గేట్లను తెరిచిన అధికారులు, సోమవారం 18 గేట్లను తెరిచి నీటిని దిగువకు విడుదల చేశారు. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలో ఒక గేట్ కొట్టుకుపోవడంతో ఎగువ నుంచి వరద ఎక్కువ మొత్తంలో వస్తుంది. కాగా సోమవారం ఎగువ నుంచి 80,100 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా, 77,598 క్యూసెక్కులు దిగువకు వదిలి 2,445 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.

సుంకేసుల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు



దేశ ఐక్యతకు పాటుపడుదాం..

పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట: తీవ్రవాదానికి వ్యతిరేకంగా, దేశ ఐక్యతకు పాటుపడుదామని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. దేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఈ నెల 9 నుంచి 20వ తేదీ వరకు చేపట్టిన రాజీవ్‌గాంధీ సద్భావన జ్యోతియాత్ర సోమవారం నారాయణపేట జిల్లాకు చేరుకుంది. మక్తల్ నియోజకవర్గంలోని కర్ణాటక బార్డర్ నుంచి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ప్రారంభమైన జ్యోతి యాత్ర నారాయణపేట జిల్లా కేంద్రానికి చేరుకుంది. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా నుంచి నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికారెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి సింగారం గేట్ వద్ద జ్యోతి యాత్రకు ఘనస్వాగతం పలికి జ్యోతిని అందుకున్నారు. అనంతరం పట్టణ పురవీధుల వెండట కర్ణాటక బార్డర్‌లోని జిలాల్‌పూర్ వరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి భారీ సైకిల్ మోటార్లతో రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి యాత్ర నిర్వహించి మళ్లీ కర్ణాటక రాష్ట్రానికి జ్యోతియాత్రను సాగనంపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికారెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి మాట్లాడారు. శాస్త్రసాంకేతిక రంగాన్ని దేశానికి పరిచయం చేసిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చిరస్మరణీయులన్నారు. రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి యాత్ర ద్వారా దేశంలో తీవ్రవాదానికి వ్యతిరేకంగా, జాతి నిర్మాణం, దేశ ఐక్యత కోసం కాంగ్రెస్ పార్టీ యాత్ర ద్వారా గొప్ప సందేశాన్ని ప్రజలకు చేరవేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యాత్ర అధ్యక్షుడు దొరై, వర్కింగ్ ప్రసిడెంట్ సుజేంద్ర శెట్టి, కార్యదర్శి అయ్యర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అప్ప, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గందె అనసూయ చంద్రకాంత్, సీనియర్ నాయకులు బండి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల నుంచి రాజీవ్‌గాంధీ సద్భావన జ్యోతిని అందుకుంటున్న పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి

పీఏసీఎస్ కార్యదర్శిపై కేసు నమోదు

జడ్చర్ల: బాదేపల్లి పీఏసీఎస్‌లో ఎరువుల అమ్మకాలకు సంబంధించి కార్యదర్శి యాదగిరి అవకతవకలకు పాల్పడ్డాడని చైర్మన్ సుదర్శన్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. దినసరి కూలీ లెక్కన పోలేపల్లికి చెందిన బి.రాఘవేందర్‌రెడ్డికి ఎరువుల అమ్మకం బాధ్యత అప్పగించే విధంగా పాలకవర్గం తీర్మానం చేసినట్టుగా తప్పుడు తీర్మానం సృష్టించి, అక్రమాలకు పాల్పడ్డాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడికి దేహశుద్ధి

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): మండలంలోని పాలెంకు చెందిన యువతిపై గుడ్లనర్వకి చెందిన యువకుడు దురుసుగా ప్రవర్తించాడు. సోమవారం మధ్యాహ్నం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. గుడ్లనర్వకి చెందిన ఓ యువకుడు పాలెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల సమీపంలో, అదే గ్రామానికి చెందిన యువతితో అసభ్యంగా ప్రవర్తించాడు. గమనించిన స్థానికులు దేహశుద్ధి చేసి షీ టీంకు సమాచారం అందించారు. వారు ఆ యువతిని నాగర్‌కర్నూల్‌కి తరలించారు. యువకుడిని బిజినేపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించడంతో ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిల్లుల కోసం పాడి రైతుల ఆందోళన



రోడ్డుపై పాలను పారబోసి నిరసన తెలుపుతున్న పాడి రైతులు

రోడ్డుపై పాలను పారబోసి నిరసన

ఉప్పునుంతల: పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉప్పునుంతల మండల కేంద్రంలో విజయ డెయిరీ పాడి రైతులు ఆందోళన చేపట్టారు. పాలను రోడ్డుపై పారబోసి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. రెండు నెలలుగా పాల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. 15 రోజులకోసారి ఇవ్వాల్సిన పాల బిల్లులను సకాలంలో ఇవ్వకపోవడంతో గేదెలు, ఆవుల పోషణ భారంగా మారిందన్నారు. కొందరు రైతులు పూర్తిగా పాడిపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతులు అచ్చంపేట పాలశీతలీకరణ కేంద్రం వద్దకు వెళ్లి మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాడిరైతులు సంతోష్‌రెడ్డి, శివకుమార్, లింగమయ్య, రమేష్‌గౌడ్, చిన్నజంగయ్య, ఎల్లయ్యయాదవ్, మహేష్ యాదవ్, పర్వతాలు యాదవ్, శ్రీశైలం పాల్గొన్నారు.

బీబీఏ విద్యార్థి బలవన్మరణం

జడ్చర్ల: స్థానిక కావేరమ్మపేటకు చెందిన విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కావేరమ్మపేటకు చెందిన వడ్డె వంశీ(19) రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి సమీపంలో గల ఇక్‌ఫాయ్ కళాశాలలో బీబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల నుంచి ఆదివారం బయలుదేరి వచ్చిన వంశీ సోమవారం మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో తల్లి, చెల్లెలును కలిసిన తర్వాత గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అలసిపోయి నిద్రపోయేందుకు గదిలోకి వెళ్లాడేమో అని కుటుంబ సభ్యులు భావించారు. తలుపు గడియ వేసుకుని ఉండడాన్ని గమనించి వెంటనే తలుపులు విరగ్గొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించారు. వెంటనే ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఉన్న ఒక్క కుమారుడు బలవన్మరణానికి పాల్పడడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యాంతం అయ్యారు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో దొంగల అరెస్టు

కోస్గి: వేర్వేరు కేసుల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ దస్రూ నాయక్ తెలిపారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కొడంగల్ మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన అంజప్ప నంబర్ ప్లేట్ లేని బైక్‌పై కోస్గి వైపు వస్తుండగా పోలీసులు ఆపారు. బైక్‌ను వదిలి పారిపోయే క్రమంలో పోలీసులు వారిని పట్టుకొని విచారించారు. దొంగతనం చేసి బైక్‌ను తరలిస్తున్నట్లు నిర్ధారించారు. ఏప్రిల్ 4, 2024న కృష్ణయ్య అనే వ్యక్తి కోస్గి బస్టాండ్‌లో ఉంచిన బైక్ చోరీ చేసినట్లు అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం పట్టుబడిన వాహనం కృష్ణయ్య బైక్‌గా నిర్ధారించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ దస్రూ నాయక్

మరో చోరీ కేసులో మహిళ..

మున్సిపల్ పరిధిలోని మల్‌రెడ్డిపల్లిలో వారం రోజుల క్రితం అలివేలు ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తులు తాళం తీసి ఇంట్లో ఉన్న బంగారు కమ్మలు, వెండి కడియాలు, బంగారు ఉంగరం, ఓ సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా, అదే గ్రామానికి చెందిన మహిళ చోరీ చేసినట్లు గుర్తించారు. దొంగిలించిన సొమ్మును పోలీసులు రికవరీ చేశారు. రెండు కేసుల్లో దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్ఐ బీవీ రమణ, పీసీ నర్సింహులు ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులు

జోగుళాంబ సన్నిధిలో ప్రముఖులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను సోమవారం ఫిలిం డైరెక్టర్ హరిశంకర్, యాంకర్ సుమ రాజీవ్ కనకాల దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ స్వాగతం పలికారు. అనంతరం ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి, వేద ఆశీర్వచనం చేశారు. అదేవిధంగా దేవదాయశాఖ ఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అద్దంకి నాగేశ్వరరావు కుటుంబ సమేతంగా దర్శించి, ఆలయంలో చండీ హోమాలు నిర్వహించారు.

➡ బాలబ్రహ్మేశ్వరస్వామి రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ గుమ్మడికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించగా.. భక్తులు హరహర మహాదేవ శంభో శంకరా అంటూ ఆలయం చుట్టూ రథాన్ని లాగారు.

➡ ఇకపై ఎవరి వాహనాలను ఆలయ ప్రాంగణంలోకి అనుమతించబోమని ఈఓ స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశాల మేరకు వాహనాలను ప్రాంగణం బయటే నిలిపివేస్తామన్నారు. కాగా, ఆలయ పరిసరాలను మున్సిపల్ కమిషనర్ సరస్వతి సిబ్బందితో శుభ్రం చేయించారు.

టీఎన్జీఓ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఈవో పురేందర్‌కుమార్..

టీఎన్జీఓ జిల్లా ఉపాధ్యక్షుడిగా అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం ఈఓ పురేందర్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నాగార్జునగౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి భీమన్న, జిల్లా కోశాధికారి విష్ణు నియామక పత్రం అందజేశారు. కాగా, ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ, సిబ్బంది, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ధర్మకర్త వెంకట్రామయ్య శెట్టి, ఎల్.నరసింహారెడ్డిలు అభినందనలు తెలిపారు.



యాంకర్ సుమకు అమ్మవారి శేషవస్త్రం అందజేస్తున్న ఈఓ పురేందర్‌కుమార్

ఉద్యోగం పేరుతో రూ.3 లక్షలు వసూలు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- రాజీ కుదుర్చేందుకు ప్రయత్నాలు?

గద్వాల క్రైం: కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తామని ఓ నిరుద్యోగి నుంచి డబ్బులు వసూలు చేసిన విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గద్వాల మండలం పూడూర్‌కి చెందిన ఓ నిరుద్యోగి జిల్లా కేంద్రంలోని బీరోలు రోడ్డుమార్గంలో ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన ఓ యువకుడు పరిచయం అయ్యాడు. నిరుద్యోగ యువతకు ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఉద్యోగం కావాలంటే ముందుస్తుగా కొంత మేర డబ్బులు ఇవ్వాల్సిందిగా ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఉద్యోగంలో చేరిన తర్వాత మిగతా నగదు అందజేసేలా ఇరువురు మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో ముందుస్తుగా రూ.3 లక్షలు చెల్లించాడు. అయితే ఉద్యోగం ఇప్పించడంలో జాప్యం కావడంతో బాధితుడు పలుమార్లు సదరు యువకుడిని నిలదీయగా.. నేడు రేపు అంటూ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దీంతో తను మోసపోయినట్లు గుర్తించి ఈ నెల 5న పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. ఈ విషయంపై పట్టణ ఎస్ఐ శ్రీనివాస్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ఉద్యోగం పేరుతో మోసపోయినట్లు వచ్చిన ఫిర్యాదు వాస్తవమేనని, ప్రస్తుతం విచారణ దశలో ఉందన్నారు. వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. ఉద్యోగం పేరుతో చెప్పే మాటలు నమ్మవద్దన్నారు. కాగా పలువురు పెద్దలు కల్పించుకుని రాజీ కుదుర్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం.

కేసీఆర్ బాటలోనే సీఎం రేవంత్‌రెడ్డి



తెలంగాణ చౌరస్తాలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

పాలమూరు: కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏమాత్రం కొత్తదనం లేదని.. కేవలం అంకెల గారడీ మాదిరిగా ఉందని, అబద్ధపు హామీలు ఇవ్వడంలో కాంగ్రెస్ పార్టీ మొదటి స్థానంలో నిలిచిందని ఎంపీ డీకే అరుణ అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో కేసీఆర్ నడిచిన బాటలోనే సీఎం రేవంత్‌రెడ్డి నడుస్తున్నాడని ఘాటు విమర్శలు చేశారు. గతంలో కేసీఆర్ రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టి.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తారుమారు చేశారని.. కొత్తగా వచ్చిన ప్రభుత్వమైనా ప్రాక్టికల్‌గా ఉంటుందనుకుంటే నెలకు రూ.60 వేల కోట్ల అప్పులు కట్టాలని సీఎం చెబుతున్నారని దుయ్యబట్టారు. ఇప్పటి వరకు రైతు రుణమాఫీ ఎంత మందికి చేశారో స్పష్టం చేయాలన్నారు. రైతుబంధు ఇప్పటి వరకు జమ చేయలేదని, కమిటీల పేరుతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. కేంద్ర నిధులతోనే రాష్ట్రంలో రోడ్లు, రైల్వే లైన్లు, స్టేషన్లు, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని, సానుభూతి కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. సీఎం విదేశీ పర్యటనతో ఒరిగిందేమీ లేదని, పెట్టుబడుల కోసం వెళ్లారా.. లేక విహార యాత్రకు వెళ్లారా అనేది త్వరలోనే తెలుస్తుందన్నారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్– బెంగళూర్ 12 లైన్ల గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మించబోతుందన్నారు. జిల్లాకు ప్రాజెక్టులు, రోడ్లు తీసుకురావడానికి ప్రతిపాదనలు చేస్తామన్నారు.

■ అంతకు ముందు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ మహిళా, యువ మోర్చాల ఆధ్వర్యంలో జిల్లా క్రీడా మైదానం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ర్యాలీలో పాల్గొని తెలంగాణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పద్మజారెడ్డి, పడాకుల బాలరాజు, జయశ్రీ, వీరబ్రహ్మాచారి, అంజయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, సాహితీరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతే ముఖ్యం

ఎంపీ కొండావిశ్వేశ్వర్‌రెడ్డి

గండేడ్: పాఠశాలల్లో వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యమని, పరిసరాల పరిశుభ్రతతోపాటు విద్యార్థులు నిత్యం ఉపయోగించే టాయిలెట్లను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. జేకేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలంలో చేపట్టిన 'స్వచ్ఛ విద్యాలయం' అనే కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా టాయిలెట్లు శుభ్రం చేసే కిష్టయ్య ఇంటికి వెళ్లి ఆయన్ను సన్మానించారు. అనంతరం దళితుడైన కిష్టయ్య ఇంట్లో వారు వండిన భోజనం వారితోపాటు భుజించారు. అక్కడి నుంచి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకొని అక్కడ టాయిలెట్లను శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టాయిలెట్లను చక్కగా వినియోగించుకోవాలన్నారు. అప్పుడే కొత్తవి మంజూరు చేస్తామన్నారు. ఉపయోగంలో లేని వాటిని వెంటనే వినియోగంలోకి తేవాలన్నారు. టాయిలెట్లు శుభ్రం చేసేందుకుగాను పూర్తి సామగ్రిని వెంటనే అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పాఠశాల ప్రహరీ శిథిలమైందని కొత్తది మంజూరు చేయాలని ఉపాధ్యాయులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అక్కడి నుంచి సల్కర్‌పేట్ పాఠశాలకు వెళ్లి అక్కడ టాయిలెట్లు పరిశీలించి శుభ్రం చేశారు. పాఠశాలలో వాటర్ ఫిల్టర్ సమస్య ఉందని చెప్పగా.. తగు చర్యలు తీసుకుంటామన్నారు. టాయిలెట్లు క్లీన్ చేసే ట్రక్కును డ్రైవర్‌కు బదులు ఆయనే స్వయంగా నడిపారు. ఆ తర్వాత పీఏసీఎస్‌కు రుణమాఫీపై ఆరాతీశారు. రైతులను ఇబ్బంది పెట్టవద్దని, మాఫీ అయిన వారి వద్ద ఆన్‌లైన్‌లో ఉన్నంత మాత్రమే కట్టించుకోవాలని, తప్పులున్న వివరాలను కూడా సరిచేయాలని పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణను కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరమేశ్వర్, పార్టీ మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ దేవన్న, ఎంపీఓ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



గండేడ్‌లో టాయిలెట్లు శుభ్రం చేస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని వనపట్లకు చెందిన కత్తె రాములు ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. 2022లో కత్తె రాములుకు సంబంధించిన నాలుగెకరాల భూమిని రూ.4 కోట్లకు కొనుగోలు చేసేందుకు కుమ్మెర చెందిన తిరుపతి రెడ్డి, నర్సాయిపల్లికి చెందిన రామకృష్ణారెడ్డి, వనపట్లకు చెందిన మన్నెపురెడ్డి ఒప్పందం కుదుర్చుకున్నారు. రూ. 2.50 కోట్లకు పైగా నగదు చెల్లించి, కత్తె రాములుతో భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మిగతా డబ్బులు ఇవ్వకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి, ఈనెల 10న ఆత్మహత్యకు యత్నించాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లికి చెందిన చాకలి వెంకటేష్(38) వ్యక్తి పురుగుల మందు తాగి సోమవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. భార్య శివలీల ఉదయం కూలీ పనులకు వెళ్లగా, ఇంట్లో ఉన్న వెంకటేష్ సాయంత్రం మద్యం మత్తులో పురుగు మందు తాగి ఇంట్లోనే పడుకున్నాడు. భార్య వచ్చే సరికి మృతి చెంది ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడును వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. మృతునికి భార్యతో పాటుగా ఇద్దరు పిల్లలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఇంట్లో చోరీ

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని తాళ్ల చెరువుకట్ట దగ్గర ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు నగదు, బంగారం చోరీ చేసినట్లు పట్టణ ఎస్ఐ రామరాజు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణానికి చెందిన నవీన్ ఈ నెల 9న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలం వెళ్లారు. సోమవారం అతను తిరిగి ఇంటికి రాగా, గేటులాక్ విరగొట్టడం చూశాడు. ఇంటి మేయిన్ డోర్‌కు సెంటర్ లాక్ సిస్టం ఉండంతో ఆ డోరు తెరుచుకోలేదు. దీంతో నార్మల్ లాక్ ఉన్న మరో డోర్‌ను బద్దలు కొట్టి దుండగులు ఇంట్లోకి వెళ్లారు. బీరువాలో ఉన్న 2తులాల బంగారం, రూ.70వేల నగదు చోరీ చేశారు. వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో ప్రతి ఒక్కరు ఇంటి డోర్లకు సెంటర్ లాక్ సిస్టం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పట్టణ ఎస్ఐ తెలిపారు.